సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025

శోభాయమానం..



అనకాపల్లి టౌన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర శనివారం వైభవంగా జరిగింది. ముందుగా జరిగిన సభలో ఏలూరు జిల్లా కామయ్యపాలెం, శ్రీక్షేత్ర శ్రీకామ్యపురం శ్రీదత్తాత్రేయ గురు పాదుకాపీఠం స్వామి అనఘానంద మాట్లాడుతూ శోభాయాత్ర అంటే పుణ్య యాత్ర అని, ఈ యాత్రలో పాల్గొనడం ద్వారా ప్రజలు భక్తి, శ్రద్ధ, ఆనందం అనుభవిస్తారన్నారు. సంకరమెట్ట జంక్షన్ వద్ద ఈ యాత్రను ఎంపీ రమేష్ ప్రారంభించారు. చిననాలుగు రోడ్ల జంక్షన్, వేల్పులవీధి జంక్షన్, నాలుగురోడ్ల జంక్షన్ మీదుగా శారదానది ఒడ్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీలో అయోధ్య రాముడు రూపంలో ఉన్న విగ్రహాలను ప్రత్యేక రథంపై ఊరేగించారు. తోకను కొండలాగ చుట్టి దానిపై కూర్చున్న ఆంజనేయ స్వామి వేషధారణ ఆకట్టుకుంది. యాత్ర అనంతరం శారదానది ప్రవాహానికి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) అయోధ్య రాముని రూపంలో ఉన్న విగ్రహాలు



ఆకట్టుకున్న ఆంజనేయస్వామి వేషధారణ

మమ్మేలమ్మా.. నూకాలమ్మా..



అమ్మవారి ఘటాలతో భారీ ఊరేగింపు

వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



నెమలి పింఛాలతో భక్తుల కోలాటం

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య నెల పండగ తుది దశకు చేరుకుంది. శనివారం 1500 మంది మహిళలు అమ్మవారి ఘటాలతో నిర్వహించిన ఊరేగింపు కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన నేలవేషాలు, నెమలి పింఛాలతో కోలాటాలు అలరించాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అమ్మవారి జాతర ప్రత్యేక అధికారి కె.శోభారాణి, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు) తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వారసత్వాన్ని నిలబెడదాం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.మధుమూర్తి పిలుపు
- ఏయూ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం
- విజన్ డాక్యుమెంట్, లోగోలు ఆవిష్కరించిన అతిథులు
- ఉత్సవాల్లో భాగంగా బీచ్‌రోడ్డులో వాకథాన్



విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి, వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖ విద్య: ఘనమైన వారసత్వం కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం అభ్యున్నతికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి పిలుపునిచ్చారు. ఏయూ శతాబ్ది వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. శతాబ్ద కాలంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అనేకమంది జీవితాలను ప్రభావితం చేసిందన్నారు. అదే విధంగా యువ మస్తిష్కాలను తీర్చిదిద్దిన ఘనత ఏయూ సొంతమని చెప్పారు. ఇది దేశ ప్రగతికి, ప్రపంచ ప్రగతికి దోహదపడిందన్నారు. తనకు ఇక్కడ చెప్పలేనన్ని అపురూప జ్ఞాపకాలు ఉన్నాయని, విద్యార్థిగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యార్థులకు జ్ఞానంతో పాటు విలువలు ఎంతో అవసరమని చెప్పారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేదిగా ఈ ప్రయాణం నిలుస్తుందని మధుమూర్తి అన్నారు. భవిష్యత్‌లో బోధన విధానాన్ని ఏఐ సాంకేతికత సవాలు చేసే దిశగా మారుతుందన్నారు. విద్య, పరిశోధన, ప్రజాసేవ రంగాల్లో ఏయూ తనదైన శైలిలో ముందుకు వెళ్లాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. విశిష్ట అతిథి ఐఐటీ పాలక్కాడ్ డైరెక్టర్ ఎ.శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ సమగ్ర విద్యను అందించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు.

ప్రాథమిక సూత్రాలు, శాస్త్ర సంబంధ అంశాలపై బలమైన పట్టు సాధించడం ఎంతో అవసరమని, అదే విధంగా సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిగా తాను ఈ స్థానంలో నిలవడానికి గల కారణం, సందర్భాలను గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి జాతీయ విద్యా విధానం డాక్యుమెంట్‌ను చదవాలని సూచించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ, దార్శనికుల వారసత్వం, నాయకత్వం ఏయూను నడిపిస్తోందన్నారు. అకడమిక్, మౌలికసదుపాయాలు, ఔట్రీచ్ రంగాల్లో ఏయూ మరింత పటిష్టంగా పనిచేస్తుందన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. ఏడాది పొడుగునా నిర్వహించే శతాబ్ది వేడుకల్లో నోబెల్ గ్రహీతలను ఆహ్వానిస్తామని వీసీ చెప్పారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు, ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు తదితరులు ప్రసంగించారు.



వాకథాన్‌లో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

విశ్రాంత ఆచార్యులకు సన్మానం

ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సి.హెచ్ శాంతమ్మ, ఆచార్య బి.ప్రసాద్ రావులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం ఆచార్య ప్రసాదరావు చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగం విద్యార్థుల మనసులను హత్తుకుంది. తాము చదువుకున్న ఆంధ్ర విశ్వవిద్యాలయ రుణం తీర్చుకోవాలని, విలువలతో కూడిన విద్యను అందించాలని ఉద్దేశంతో తాను స్థాపించిన పాఠశాల అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఏయూ విజన్ డాక్యుమెంట్, లోగోలను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమం ఆరంభంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు పూర్వ ఉపకులపతులు, విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

స్పౌజ్ పింఛన్ మంజూరులోనూ కక్కుర్తే

- పింఛన్ మార్పిడికి కటాఫ్ తేదీ
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు

నక్కపల్లి: అధికారంలోకి వచ్చి 11 నెలలైంది.. కొత్తగా ఒక్క పింఛనూ మంజూరు చేయలేదు. కనీసం మరణించిన పెన్షన్‌దారు స్థానంలో అతని భార్యకు మార్పిడి చేయలేదు. ఇన్నాళ్లకు స్పౌజ్ పింఛన్లకు జీవో జారీ చేశారనుకుంటే గత ఏడాది అక్టోబర్ 31 వరకు కటాఫ్ తేదీ పెట్టి మళ్లీ తమ నైజం బయటపెట్టుకున్నారు. అక్టోబర్ తర్వాత తమ భర్తలు మరణించడమే తాము చేసుకున్న పాపమా అంటూ వారి జీవిత భాగస్వాములు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. మళ్లీ ఎన్నాళ్లకు మంజూరు చేస్తారోనని ఆవేదన చెందుతున్నారు. ఇదేమి విధానం అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పింఛను తీసుకునే భర్త చనిపోతే మరుసటి నెలలోనే అతని భార్య పేరున పింఛను మంజూరు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రకటించారు. ఈ హామీ నెరవేర్చకపోగా భర్త తీసుకునే పింఛను అతని మరణానంతరం భార్యకు మంజూరు చేయడానికి కటాఫ్ తేదీ విధించడం పట్ల బాధితుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెన్షనర్ చనిపోతే అతను తీసుకునే పింఛనును రెండు నెలల వ్యవధిలోనే భార్య పేరున మంజూరు చేసేవారు. కూటమి సర్కారు అధికారం చేపట్టి 11 నెలలు పూర్తవుతున్నా స్పౌజ్ కోటా కింద ఇవ్వాల్సిన పింఛన్లు మంజూరు చేయలేదు. తాజాగా పింఛను తీసుకునే భర్త చనిపోతే అతని భార్య పేరున పింఛను మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఏప్రిల్ 25 నుంచి ఆన్‌లైన్‌లో పింఛన్ల పోర్టల్ ఓపెన్ చేసి లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అయితే 1-12-2023 నుంచి 31-10-2024 తేదీ మధ్యకాలంలో చనిపోయిన వారి పింఛన్లు మాత్రమే వారి భార్యలకు మంజూరు చేస్తామని ప్రకటించింది. ఇలా పింఛన్లు పొందేందుకు అనకాపల్లి జిల్లాలో 3904 మంది అర్హత సాధించారు. వీరు మాత్రమే సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి.

ఇంకా ఎందరో..

కటాఫ్ తేదీ తర్వాత చనిపోయిన వారు చాలా మంది ఉన్నారు. ప్రతి గ్రామంలో సుమారు 30 మందికి తక్కువ లేకుండా పింఛన్లు తీసుకుంటూ చనిపోయిన వృద్ధులు ఉన్నారని, వారి భార్యలందరి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తమవుతోంది. భర్త పింఛను కోసం ఏడాది నుంచి ఎదురు చూసి చనిపోయిన భార్యలు కూడా ఉన్నారు. కటాఫ్ తేదీని సవరించి అర్హులైనవారందరికి పింఛన్లు మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.


పాత కోర్టు భవనం పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



పాత కోర్టు పరిసరాలను పరిశీలిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పాత కోర్టు భవనాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు శనివారం పరిశీలించారు. అనకాపల్లి కోర్టు ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న నేపథ్యంలో బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వచ్చిన ఆయన పాత కోర్టు భవనాన్ని వాడుకలోకి తీసుకురావచ్చా లేదా అన్నది పరిశీలించారు. ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి నిర్ణయాన్ని తెలుపతామన్నారు. 10వ అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి దుర్గారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం



దేవరాపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ఒంపోలులో నూకరాజు కాలిపై గాయం



దేవరాపల్లిలో పిచ్చికుక్క దాడితో బాలుడి శరీరంపై గాయాలు

- దేవరాపల్లి, మునగపాక మండలాల్లో పలువురికి తీవ్ర గాయాలు

దేవరాపల్లి/మునగపాక: పిచ్చికుక్కల దాడిలో దేవరాపల్లి, మునగపాక మండలాల్లో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. దేవరాపల్లిలో ఒక కుక్క శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 12 గంటల వ్యవధిలో 15 మందిపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. శనివారం బందారు వీధిలో కుళాయి నీరు పడుతున్న పదో తరగతి విద్యార్థి బందారు దీపికపై దాడి చేసి ఎడమ కాలిపై నుంచి కింద వరకు అనేక చోట్ల తీవ్రంగా గాయపర్చింది. మరిడిమాంబ కాలనీలో అప్పుడే నిద్ర లేచి బయటకు వచ్చిన ఆరేళ్ల బాలుడు జాగరపు ఉదయ్‌కుమార్‌పై దాడి చేసి పొట్ట, కాలు, చెవులపై తీవ్ర గాయాలు చేసింది. శంభువానిపాలెంలో ఉపాధి పనులకు వెళ్తున్న ఉగ్గిన గాంధీని, ఇంటి వద్ద మంచంపై కూర్చున్న ఇగ్రా దేముడిని, వడ్రంగి పనికి వెళ్తున్న బల్లంకి వెంకటరావుపై కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఇలా మొత్తం 15మందిని తీవ్రంగా గాయపరిచింది. కుక్క కాటుకు గురైన వారందరికీ ఇమ్యునోగ్లోబిన్ ఇంజక్షన్లు చేసి వైద్య సేవలందించామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్యమేఘన తెలిపారు. మునగపాక మండలం ఒంపోలులో పిచ్చికుక్క శనివారం పలువురిని కరవడంతో గాయాలపాలయ్యారు. సమీపంలోని అనకాపల్లిలో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. గ్రామానికి చెందిన మంత్రి నూకరాజు, గొర్లి శేషులమ్మ,బండి సత్యనారాయణతో పాటు మరో ముగ్గురు వ్యక్తులను కుక్క పలుచోట్ల గాయపరచింది.

వేట నిషేధ భృతి పంపిణీ



మత్స్యకారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్

నక్కపల్లి:

గంగపుత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే నష్టపరిహారాన్ని శనివారం పంపిణీ చేశారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ జిల్లాలోని 6 మండలాల్లో 12,544 మందికి సంబంధించిన రూ.25.288 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకార మహిళల కోసం అడ్డురోడ్డులో షెడ్డు నిర్మాణం, మత్స్యకార పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాల నిర్మాణం జిల్లాకేంద్రంలో మత్స్యకారుల కసం రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.ఫిషరీస్ జేడీ ప్రసాద్, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు చేతికి మెడికల్ కాలేజీ

- మంత్రి కంటే స్పీకరే బాగుంది.. చంద్రబాబు నా దగ్గరకు రావాలి
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై దాడులు చేయాలి
- కేజీబీవీ భవనాలకు స్పీకర్ అయ్యన్న శంకుస్థాపన

నాతవరం: మాకవరపాలెం మండలంలో నిర్మించే మెడికల్ కాలేజీకి ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని, దానిని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు ఆలోచన చేస్తున్నామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. మర్రిపాలెం గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)లో రూ.కోటి 60 లక్షలతో చేపట్టనున్న అదనపు భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో అనుమతులు లేకుండా మెడికల్ కాలేజీ భవనాలను గోడల వరకు నిర్మించారని, వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచన చేస్తున్నామన్నారు. ఇటీవల ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లపైనే యువకులు గుంపులుగా మద్యం తాగుతున్నారని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి తీసుకునేవారిని అరెస్టు చేయాలని రూరల్ సీఐ రేవతమ్మను ఆదేశించారు. ప్రసవాల కోసం గర్భిణులను ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంత్రి కంటే స్పీకర్ పదవే బాగుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు సైతం తన దగ్గరకే రావాలన్నారు. కేజీబీవీ ప్రిన్సిపల్ కె.భవాని, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష, తహసీల్దార్ వేణుగోపాల్, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.



మర్రిపాలెంలో అదనపు భవనానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు

వేములపూడిలో..

నర్సీపట్నం: వేములపూడి కేజీబీవీ జూనియర్ కళాశాల నూతన భవనాలకు స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.164.02 లక్షలతో అదనపు భవనాలను నిర్మిస్తున్నామన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని 150 నుంచి 200కి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నానన్నారు. వేములపూడి పీహెచ్‌సీ స్థాయిని కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి బయపురెడ్డిపాలెం బ్రిడ్జి దగ్గర నుంచి కోటవురట్ల మండలం కొత్తూరు వరకు రూ.21 కోట్లతో పక్కా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, సర్పంచ్ నూకాలమ్మ, ఎంపీటీసీ బోశం రాంప్రసాద్ పాల్గొన్నారు.

అవిశ్వాసానికి రండి.. రూ.కోటి ఇస్తాం!

- డిప్యూటీ మేయర్ కోసం కూటమి కుయుక్తులు
- మహిళా కార్పొరేటర్లకు బంఫర్ ఆఫర్
- స్టేట్ డైరెక్టర్ పోస్టులు ఇస్తామంటూ ఫోన్లు
- అయినా తలొగ్గని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు



గుర్తింపు కార్డు చూపమంటున్న పోలీసులు



గుర్తింపు కార్డు లేకపోయినా పోలీసుల పరిచయంతో లోపలికి వెళ్లిన కార్యకర్త

సాక్షి, విశాఖపట్నం/డాబాగార్డెన్స్: మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు మ్యాజిక్ ఫిగర్ కోసం కూటమి నేతలు ఎలాంటి ప్రయత్నాలు చేశారో.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై అవిశ్వాస తీర్మానంలోనూ అదే తరహా పరిస్థితి కొనసాగింది. గతంలో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసాన్ని నెగ్గించుకుని, ఆ పీఠాన్ని దక్కించుకోవడానికి 74 మంది కార్పొరేటర్ల బలం అవసరం కాగా, దాన్ని సాధించేందుకు చివరి నిమిషం వరకు కార్పొరేటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు 74 మంది బలంతో ఆ అవిశ్వాసం నెగ్గింది. శనివారం జరిగిన డిప్యూటీ మేయర్ పీఠం విషయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. డిప్యూటీ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి 74 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం. ఈ అవిశ్వాస తీర్మానం వీగిపోతుందేమోనన్న భయంతో కూటమి నేతలు చివరి నిమిషం వరకు ప్రలోభాలకు, బెదిరింపులకు పాల్పడ్డారు. తమ వద్ద ఉన్న కార్పొరేటర్లపై పూర్తి విశ్వాసం లేని తెలుగుదేశం, జనసేన, బీజేపీ శాసనసభ్యులు, కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీకి చెందిన మహిళా కార్పొరేటర్లను లక్ష్యంగా చేసుకుని ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారు.

కొందరు మహిళా కార్పొరేటర్లకు ఫోన్లు చేసి, అవిశ్వాస ఓటింగ్‌కు హాజరై, డిప్యూటీ మేయర్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తే బంఫర్ ఇస్తామంటూ ఆశ చూపారు. రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవిని కల్పిస్తామని, అదనంగా కోటి రూపాయల నగదును కూడా ఇస్తామని ఫోన్లలో బేరసారాలు జరిపారు. వెంటనే నగదు బదిలీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఎలాగైనా వచ్చి ఓటు వేయాలని కోరారు. అయితే, కూటమి నేతల ప్రలోభాలకు వైఎస్సార్ సీపీ మహిళా కార్పొరేటర్లు ఏమాత్రం లొంగలేదు. వారి ఆఫర్లను గట్టిగా తిరస్కరించారు. పార్టీ గుర్తుపై గెలిచి, ఇలాంటి వాటికి లొంగే దుర్బుద్ధి తమకు లేదని ఘాటుగా బదులివ్వడంతో కూటమి నేతలు తోకముడిచారు. చివరికి తమ శిబిరంలో ఉన్న 74 మంది కార్పొరేటర్లను బతిమాలుకుని, ఒత్తిడి తెచ్చి డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస ఓటింగ్‌కు తీసుకొచ్చారు. ఆ 74 మందిని కాపాడుకోవడానికి చివరి నిమిషం వరకు అష్టకష్టాలు పడిన కూటమి.. అవిశ్వాసంలో కేవలం ఒక్క ఓటు మెజారిటీతో విజయం సాధించి బతుకు జీవుడా అని ఊపిరిపీల్చుకుంది. అయితే డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని కూడా వైఎస్సార్ సీపీ, సీపీఎం, సీపీఐ కార్పొరేటర్లు బహిష్కరించారు. కాగా.. గుర్తింపు కార్డు ఉన్నవారికే జీవీఎంసీ ప్రాంగణంలోకి అనుమతిస్తామని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్ ప్రకటించినా.. క్షేత్ర స్థాయిలో ఆయన ఆదేశాలు అమలు కాలేదు. కూటమి చోటా నాయకులు సైతం దర్జాగా జీవీఎంసీలోకి ప్రవేశించడం గమనార్హం.

గంజాయి కేసులో పాత నిందితుడు అరెస్టు



నిందితుడు సన్యాసి రావును అరెస్టు చేసిన పోలీసులు

చోడవరం: గంజాయి కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు కొర్రా సన్యాసిరావును అరెస్టు చేసినట్టు సీఐ అప్పలరాజు శనివారం చెప్పారు. 2022లో ఒక గంజాయి కేసులో నిందితుడు సన్యాసిరావు పరారీలో ఉన్నాడని తెలిపారు. అల్లూరి జిల్లా హుకుంపేట మండలానికి చెందిన సన్యాసిరావును చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర పట్టుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

జాతీయ రహదారిపై హై అలెర్ట్

- ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ



జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నక్కపల్లి: కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పోలీసు యంత్రాంగం హై అలెర్ట్ ప్రకటించింది. జాతీయ రహదారిపై శనివారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తనిఖీలు నిర్వహించి, ఆధారాలు లేకపోతే అదుపులోకి తీసుకోవాలని ఎస్పీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అప్రమత్తమైనట్టు సీఐ తెలిపారు. తీరప్రాంత గ్రామాలను సైతం అలెర్ట్ చేశారు. దండోరా మూలంగా తెలియజేయాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు.

మద్యం బాధితులకు ఉచిత చికిత్స



మాట్లాడుతున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

తుమ్మపాల: ఆల్కహాల్ వ్యసనం నుంచి విముక్తి కోసం 30 రోజుల డి–అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి టి.రాజశేఖర్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా 'కమిటీ ఆన్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని మండలంలో కొత్తూరు గ్రామంలో విజయ విశాఖ క్యాటిల్ ఫీడ్ కంపెనీలో కార్మికులతో శనివారం నిర్వహించారు. ఎవరైనా డి –అడిక్షన్ కేంద్రంలో చేరితే ఉచిత భోజనం, వసతి సౌకర్యంతో 30 రోజుల పాటు ఉచితంగా చికిత్స అందిస్తున్నామన్నారు. కేర్ కమిటీ సభ్యులు సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సన్యాసిరావు పాల్గొన్నారు. అంతకుముందు పిసినికాడలో డి–అడిక్షన్ కేంద్రం, జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని డి– అడిక్షన్ కేంద్రాన్ని సందర్శించి చికిత్స పొందుతున్నవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ లక్ష్మునాయుడు, కంపెనీ ప్రతినిధి ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

బాలుడి కోసం డోలీ మోత



బాలుడిని కొండ శిఖరాగ్రం నీలిబంద నుంచి వైద్యం కోసం డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

రోలుగుంట: అర్ల గిరిజన పంచాయతీ శివారులో కొండ శిఖరాగ్రాన ఉన్న నీలిబంద, పీత్రుగడ్డ, తదితర గ్రామాల ప్రజలు ఇప్పటికీ డోలీలనే ఆశ్రయిస్తున్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న నీలిబందకు చెందిన గెమ్మిలి సింహాద్రి (9)ని అతని తల్లిదండ్రులు శనివారం డోలిలో రావికమతం మండలం కుంజుర్తి గ్రామం వరకు ఆరు కిలోమీటర్లు మోసుకొచ్చి అక్కడ నుంచి ఆటోలో తరలించి ఆస్పత్రిలో చేర్చారు. కొయ్యూరు మండలం చిట్టింపాడు ట్రైబల్ వేల్ఫేర్ స్కూల్లో నాలుగో తరగతి చదువుతున్న సింహాద్రి చేతులు, కాళ్లపై కురుపులతో ఇంటికి వచ్చాడు. తరువాత జ్వరం కూడా రావడంతో నడవలేని స్థితిలో ఉన్న ఆ బాలుడిని అతని తండ్రి, తాతయ్య శనివారం డోలిలో వైద్యం కోసం తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

గొలుగొండ : కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ తారకేశ్వరరావు అందించిన వివరాలివి. గ్రామానికి చెందిన చిటికెల సూరిబాబు(68) బైక్‌పై పొలం నుంచి కృష్ణదేవిపేట వస్తుండగా సెంటాన్స్ స్కూల్ వద్ద కృష్ణదేవిపేట నుంచి నర్సీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్ ఢీకొంది. దీంతో సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తిచేశారు. సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

చందనోత్సవం టికెట్ల విక్రయాల్లో గందరగోళం

చందనోత్సవం టికెట్ల విషయంలో గందరగోళం నెలకొంది. ఈనెల 30న జరిగే ఉత్సవం కోసం రూ.300, రూ.1000 టికెట్లను ఈనెల 24 నుంచి విక్రయిస్తామని ప్రకటించినా, తొలిరోజు సింహాచలం కొండపైన, రెండు బ్యాంకుల్లోనే అమ్మకాలు జరిగాయి. నగర బ్యాంకులకు టికెట్లు ఆలస్యంగా చేరాయి. శనివారం నాటికి రూ.1000 టికెట్లు కొండపైనా, బ్యాంకుల్లోనూ అందుబాటులో లేక భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుంటే భవిత

- అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఆపరేటింగ్ పార్టనర్ డి.శివకుమార్
- ఘనంగా ఐఐఎం ఈఎంబీఏ ప్రత్యేక స్నాతకోత్సవం
- 124 మందికి పట్టభద్రులకు అవార్డులు



మాట్లాడుతున్న అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఆపరేటింగ్ పార్టనర్ డి.శివకుమార్

బీచ్‌రోడ్డు (విశాఖ): వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవడం వల్ల వ్యక్తిగత వృద్ధితోపాటు సంతృప్తిని పొందవచ్చని అడ్వెంట్ ఇంటర్నేషనల్ ఆపరేటింగ్ పార్టనర్ డి.శివకుమార్ అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎం) ఈఎంబీఏ ప్రత్యేక స్నాతకోత్సవాన్ని శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ–విలువను స్వతంత్రంగా నిర్వచించుకోవాలన్నారు. పోలికల ఒత్తిళ్లను నిరోధించాలని సూచించారు. మోసపూరిత సిండ్రోమ్‌ను అధిగమించడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. ఐఐఎం గవర్నర్ల బోర్డు సభ్యుడు ప్రొఫెసర్ జనత్ షా మాట్లాడుతూ వ్యాపారం ద్వారా సానుకూల సామాజిక ప్రభావాన్ని సృష్టించడం, వాటి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ డైరెక్టర్ నివేదికను సమర్పించారు. ఒక ముఖ్యమైన మైలురాయిని గుర్తుచేసేందుకు ప్రత్యేక స్నాతకోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర నిధులతో నడిచే సాంకేతిక సంస్థలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు (పీజీపీఎంసీఐ)ల్లో పనిచేస్తున్నవారు కోసం ప్రారంభించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ (ఈఎంబీఏ), పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సులను వీరంతా దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. అభ్యర్థుల్లో సుమారు 70 శాతం మంది వ్యూహాత్మక ఆలోచన, విస్తృత వ్యాపార దృక్పథాలు, మెరుగైన విశ్వాసం, విశ్వసనీయతలో మెరుగుదలను నివేదించారని పేర్కొన్నారు. దాదాపు 60 శాతం మంది తమ నాయకత్వ సామర్థ్యాల్లో వృద్ధిని చూశారన్నారు. 27 శాతం మంది గ్రాడ్యుయేట్లు ప్రమోషన్లు లేదా కొత్త అవకాశాల ద్వారా కెరీర్ పురోగతిని సాధించారన్నారు.

ఇద్దరికి గోల్డ్ మెడల్

ఈఎంబీఏ ప్రోగ్రామ్ నుంచి మొత్తం 124 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. ఈ కోర్సులో అగ్రస్థానంలో నిలిచిన నవనీత్ బత్రాకు, రెండో స్థానంలో నిలిచిన అనిర్బన్ దత్తాకు గోల్డ్ మెడల్‌ను అందజేశారు. ఈ వేడుకలో సుమారు 200 మంది గ్రాడ్యుయేట్లను సత్కరించారు.

నాటి లేటరైట్ మాటలు నేడు ఏమయ్యాయి?

- దోపిడీ వెనుక స్పీకర్ హస్తం ఉందో లేదో స్పష్టం చేయాలి
- ఆరోపించిన మాజీ ఎమ్మెల్యే గణేష్



లేటరైట్‌పై నాడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడిన వీడియోను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : లేటరైట్ దోపిడీ వెనుక స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు హస్తం ఉందో లేదో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాతవరం మండలం, సుందరకోటలో రూ.వేల కోట్ల ఖనిజ సంపదను దోచుకునేందుకు కూటమి ప్రభుత్వం దారులు తెరిచిందన్నారు. లేటరైట్ ముసుగులో బాక్సైట్‌ను తవ్వుకు పోతున్నారన్నారు. 2022లో టీడీపీ నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో ఆందోళన చేపట్టి, లేటరైట్ ముసుగులో బాక్సైట్ పట్టుకుపోతున్నారని గగ్గోలు పెట్టిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇప్పుడు ఎందుకు నోరుమెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. స్పీకర్ ప్రమేయంతోనే లేటరైట్ దోపిడీ జరుగుతుందనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతుందన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు. ఖనిజ సంపదను దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై కూటమి నేతలకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. నర్సీపట్నంకు చెందిన ఓ ప్రముఖ హోటల్ యజమాని లేటరైట్ తవ్వకాలు జరిపించడంలో కీలకపాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. హోటల్ యజమాని రాజమండ్రిలోని ఓ కంపెనీతో రూ.వందల కోట్లు బేరం కుదుర్చుకున్నారన్నారు. హోటల్ యజమాని సుందరకోట పెద్దలను పిలిపించి మాట్లాడడం జరిగిందన్నారు. హోటల్ యజమాని స్వయంగా లేటరైట్ ప్రాంతానికి వెళ్లి లేటరైట్‌కు అనుకూలంగా లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తోందని కొందరని హెచ్చరించడం జరిగిందన్నారు. లేటరైట్ దోపిడీలో కీలక పాత్ర వహిస్తున్న హోటల్ యజమానికి స్పీకర్ అండదండలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆరోపించారు. ఆ ప్రాంత గిరిజనులకు ఎలాంటి నష్టం జరిగినా సహించబోమని, వైఎస్సార్‌సీపీ వారికి అండగా ఉంటుందని గణేష్ తెలిపారు.

122 కేజీల గంజాయి పట్టివేత

- ఐదుగురు అరెస్ట్



గంజాయి, నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయించే ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.6 లక్షలు విలువ చేసే 122 కేజీల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం ముందుగా అందిన సమాచారం మేరకు సంపతిపురం జంక్షన్ వద్ద తనిఖీ చేస్తుండగా కూండ్రం వైపు నుంచి అనకాపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరిని అనుమానం వచ్చి పట్టుకున్నామన్నారు. వారి వెనుక ఒక ప్యాసింజర్ ఆటోలో గంజాయిని తీసుకొస్తున్న విషయం తెలిపారన్నారు.

ఆటో సీటు కింద మూడు బ్యాగులలో రెండు కిలోల చొప్పున 61 ప్యాకెట్లు లభ్యమయ్యాయని, దాంతోపాటు ఐదు సెల్‌ఫోన్లు, ఆటో, ద్విచక్ర వాహనం, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆటోలో ప్యాసింజర్ల మాదిరిగా ఇద్దరు మగవారు, ఒక మహిళ వస్తున్నారని, ఒడిశా రాష్ట్రానికి చెందిన నిందితుడు ప్రశాంత్ బారిక్ గతంలో చాలా నేరాల్లో అరెస్టయి, శిక్ష అనుభవించాడన్నారు.

అతనితోపాటు సుకాంత్ గౌడ్, సుబర్ణ హరిజన్, బాసుకిలో, బతన్ హరిజన్‌లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందుతులను పట్టుకున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్, జి.రవికుమార్, ఎస్ఐ మల్లికార్జునరావు పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించి ప్రశంసా పత్రాలను అందిచారు. సమావేశంలో డిఎస్పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి



కనకరాజు (ఫైల్)

రావికమతం : ఆటో బోల్తా పడి ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన టి.అర్జాపురం గ్రామంలో చోటు చేసుకుంది. కొత్తకోట పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలివి. టి.అర్జాపురం పంచాయతీ శివారు చిలకవానిపాలెం గ్రామానికి చెందిన యాదిగిరి కనకరాజు (31) ఆటో నడుపుతూ, తాపీ మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు సంతానం తేజష్(4), దీక్షిత (11నెలలు) ఉన్నారు. శనివారం తెల్లవారుజామున కనకరాజు ఆటోలో అర్జాపురం నుంచి దొండపూడి అత్తగారి ఇంటికి వెళుతుండగా అర్జాపురం శాస్త్రిగారి తోట వద్ద కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో గాయపడిన కనకరాజును స్థానికుల సహాయంతో హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఘటనపై తండ్రి రాజుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కనకరాజు అకాల మృతితో చిలకవానిపాలెం, దొండపూడి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఏలేరు కాలువలో పడి దివ్యాంగుడి మృతి



మృతి చెందిన కొండ్రపు సాయి, సాయి (ఫైల్)

కశింకోట: తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువలో ప్రమాదవశాత్తూ జారిపడి దివ్యాంగ విద్యార్థి మృతి చెందాడు. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన కొండ్రపు సాయి (14) తల్లి ఆదిలక్ష్మితో కలిసి తాళ్లపాలెంలో బంధువుల ఇంటికి ఈ నెల 23న వివాహానికి వెళ్లాడు. అక్కడ శుక్రవారం సమీపంలోని ఏలేరు కాలువకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన సాయి కాలుజారి ఏలేరు కాలువలో పడి గల్లంతయ్యాడు. సాయి కోసం బంధువులు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. శనివారం సమీపంలో కాలువలో మృతదేహం బయటపడింది. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కె.రమణమ్మ కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. పుట్టుకతోనే మూగ, చెవిటి అయిన సాయి విశాఖలోని పెద్ద వాల్తేర్‌లోని శాంతి ఆశ్రమంలో 9వ తరగతి చదువుతున్నాడన్నారు. తల్లిదండ్రులు కూలీలని, మృతుడు రెండో కుమారుడన్నారు.

బార్క్ ప్రహరీ పనులు అడ్డుకున్న రైతులు



బార్క్ ప్రహరీ పనులు అడ్డగించిన రాయపాలెం రైతులు

అచ్యుతాపురం రూరల్ : రాయపాలెం గ్రామంలో బార్క్ ప్రహరీ నిర్మాణ పనులు దౌర్జన్యంగా చేపడుతున్నారని రైతులు శనివారం అడ్డుకున్నారు. డీ–పట్టా భూములకు నక్కపల్లిలో ఇచ్చిన రేటు ప్రకారం రూ.60 లక్షలు ఎకరాకు పరిహారం కల్పించి పనులు ప్రారంభించాలని రైతులు కోరారు. అలా కాకుండా దౌర్జన్యంగా పనులు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామంలో జిల్లా కలెక్టర్ చర్చలు జరిపేందుకు కమిటీ వేసి రైతులందరికీ న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కో–ఆప్టెడ్ సభ్యుడు నర్మాల కుమార్ రైతులకు మద్దతుగా నిలిచారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశం



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీరాజ్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు, సిబ్బంది

కశింకోట: వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఆదేశించారు. కశింకోటలోని ఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. అధికారులు, సిబ్బందితో అభివృద్ధి పనులు, నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. లోడ్ అధికంగా ఉన్న చోట విద్యుత్ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేయాలన్నారు. హెచ్చు తగ్గులు లేకుండా విద్యుత్ వినియోగం కచ్చితంగా నమోదయ్యే ఐఆర్ పోర్టు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. పరిమితికి మించి లోడ్ వినియోగిస్తున్న వినియోగదారుల నుంచి డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసి సర్వీసులను క్రమబద్ధీకరించాలన్నారు. ఈఈ ఎస్ రామకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

వజ్ర కవచాలంకృతిలో ధ్యాన వేంకటేశ్వరుడు



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారిని పూలమాలలు, తులసీ మాలలతో పాటు వజ్ర కవచాలంకృతులతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామాలతో అర్చించి పూజలు చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

హైస్కూలు టాపర్లకు అభినందన



టెన్త్ విద్యార్థులకు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలులో టెన్త్ చదివి అధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఆళ్ల దుర్గా హేమంత్ 559, పాలా దుర్గాప్రసాద్ 553 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో స్కూలు స్థాయిలో నిలిచారు. ఈ సందర్భంగా మొక్కలు అందించి అభినందనలు తెలిపారు. స్కూలు కమిటీ చైర్మన్ గణిరెడ్డి శివ, హెచ్‌ఎం ఏవీఎస్ మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



తాళ్లపాలెంలో ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది వాహనాల తనిఖీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, అచ్చెర్ల రోడ్డు ప్రాంతాల్లో శనివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల, రవాణా గురించి ఆరా తీశారు.

నేడు గంధం అమావాస్య ఉత్సవం



కశింకోటలో నూకాంబిక ఆలయం

కశింకోట: స్థానిక నూకాంబిక ఆలయంలో ఆదివారం గంధం అమావాస్య ఉత్సవం జరగనుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 1,217 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,870	4,300
రెండో రకం	3,620	4,170
మూడో రకం	3,200	3,600

అనకాపల్లి సినిమాలు

రాజా	: జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1:	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 :	సారంగపాణి జాతకం
పర్తిసాయి	: ఓదెలా-2
షిర్డీసాయి	: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర	: పారం
శ్రీసత్య	: భరత్ అనే నేను
రామచంద్ర	: తుడరుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-31, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 412 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

పశువులకు వడదెబ్బ ముప్పు





- వేసవి తాపానికి గురై అనారోగ్యం పాలు
- పశు సంరక్షణలో తగిన జాగ్రత్తలు అవసరం
- పాడి రైతులకు పశువైద్యుల సూచనలు

పశువుకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తుమ్మపాల: వేసవిలో పశుపోషణ, సంరక్షణలోనూ తగిన జాగ్రత్తలు పాటించాలని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల కారణంగా మూగజీవాలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందని, తద్వారా వాటిని నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పాడిరైతులు, పశుపోషకులు తమ వద్ద ఉన్న ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలు వంటి పశు సంపదను కాపాడుకోవాలని చెబుతున్నారు. సాధారణంగా 18 నుంచి 35 డిగ్రీల ఉష్ణోగ్రత.. పశువులకు సౌకర్యంగానే ఉంటుంది. అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతేనే అవి తీవ్ర అస్వస్థతకు గురై, పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటాయి. ముఖ్యంగా వడదెబ్బకు గురైన ఆవులు, గేదెలు చూడి కట్టే అవకాశాన్ని కోల్పోతాయి. ఒక్కోసారి మృత్యువాత పడే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించి, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వేసవి వ్యాధుల నుంచి మూగజీవాలను రక్షించుకోవచ్చని పశువైద్యాధికారులు సలహా ఇస్తున్నారు.

పాడి పరిశ్రమపై ఆధారం..

నియోజకవర్గంలో ప్రతి పల్లెలోను రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో సగానికి పైగా భూములు మెట్ట ప్రాంతాలు కావడంతో వేసవిలో వ్యవసాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. దీంతో రైతులు జీవనం కోసం పాడి పరిశ్రమ తప్పనిసరిగా కొనసాగుతోంది. ప్రతి రైతు కుటుంబం వద్ద కనీసం ఆవు, గేదెల పెంపకం జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో మేకలు, గొర్రెల పెంపకం ఉంది. రైతులకు పంటలు కలిసిరాని సమయంలోనూ పాడి రంగమే ఆదుకుంటోంది. వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో రైతులు మరింత ఆదాయం కోల్పోయే పరిస్థితులు ఉన్నాయి. అటువంటి పాడి సంపదను కాపాడుకోవాలంటే జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వేసవి, శీతాకాలం, వర్షాకాలం. ఇలా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల్లో వాటిని ఏ విధంగా పెంచాలి, అవి ఉండే ఆవాసాలను ఏ విధంగా తయారు చేయాలన్న దానిపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులను మేతకు తీసుకువెళ్లాలి. వాటిని ఉంచే పశుశాలల్లో చల్లని వాతావరణం ఉండేలా, గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేయాలి. వీలైనంత వరకు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తే మంచిది. ఉదయం పచ్చగడ్డి, రాత్రి ఎండు గడ్డి మేతగా వేయాలి.

పాటించాల్సిన జాగ్రత్తలివే...

- పశువుల తాగే నీటిని స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచాలి.
- కలుషిత నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధిని కలుగజేస్తాయి.
- రోజులో కనీసం నాలుగు సార్లు నీటిని అందించాలి.
- పగలు నీడ ప్రాంతంలోని తొట్టిలో ఉన్న నీటినే పశువులకు తాగించాలి.
- ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువుల వయసు ఆధారంగా రోజుకు 35 లీటర్ల నీరు అవసరం
- పాలిచ్చే పశువులు ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల నీరు తాగుతాయి.



తీవ్ర ఎండల్లోను చెట్ల కిందే పశువులు

మండలాల వారీగా పశువుల సంఖ్య..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	పందులు	మొత్తం
అనకాపల్లి	7,010	12,139	3,999	6,620	0	29,768
కశింకోట	7,096	10,348	7,410	8,620	379	33,853
మొత్తం	14,106	22,487	11,409	15,240	379	63,621

సన్‌స్ట్రోక్ నివారణ చర్యలు..

- పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు చల్లని నీటితో తడుపుతూ ఉండాలి.
- పశువుల పాక పాత రేకులతో వేసినట్లయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకులు లేదా వరి, రెల్లిగడ్డితో కప్పాలి.
- మంచినీరు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకువెళ్లాలి.
- పశువులకు వీలైనంత వరకు పచ్చ గడ్డిని మేతగా వేయాలి.
- సంకరజాతి ఆవులు, గేదెలు ఉన్న పాకలో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బ లక్షణాలు...

- పశువుల శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 106 డిగ్రీల వరకు పెరుగుతుంది. అలాగే నడిచేటప్పుడు పశువులు తూలుతాయి.
- శ్వాసక్రియ రేటు ఎక్కువగా ఉంటుంది. పశువులు చాలా నీరసంగా కనబడతాయి. నోటి వెంట చొంగ కూడా కారుతుంది.
- ఒక్కోసారి కింద పడి విలవిలలాడి స్పృహ కోల్పోతాయి. అదే సమయంలో పశువులు నీటి కోసం అల్లాడుతుంటాయి. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి పడిపోతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పునరుత్పత్తి ప్రక్రియ కూడా కుంటుపడుతుంది.

నల్లజాతి పశువులకే వడదెబ్బ ముప్పు



పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పశువులకు అనారోగ్య సమస్యలు వస్తే సొంత వైద్యం చేయకూడదు. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేని ప్రాంతాల్లో నీటి సౌకర్యం అందుబాటులో లేనప్పుడు, అధిక శ్రమకు గురై వేడిగాలుల తాకిడికి లోనైనప్పుడు వడదెబ్బకు గురవుతాయి. సాధారణంగా ఒకటి కన్నా ఎక్కువ సంఖ్యలో ఒకేసారి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బ తగిలిన పశువుల ముఖాన్ని చల్లని నీటితో కడగాలి. ఐస్‌గడ్డను పలుచటి వస్త్రంలో చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. వైద్యులకు సమాచారం ఇచ్చి సెలైన్ పెట్టించాలి.

– డాక్టర్ అనిల్, పశువైద్యాధికారి, అనకాపల్లి మండలం

ఉగ్రవాదులను అంత మొందించాలి



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

అనకాపల్లి: అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకలను మట్టుపెట్టి, ఇటువంటి దుశ్చర్య పునరావృతం కాకుండా చూడాలని అనకాపల్లి ప్రెస్ క్లబ్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు మళ్ల భాస్కరరావు కోరారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ధర్నా చేసి, ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంబాబు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి గణేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు చాగంటి సర్వారావు (అవ్వ), కార్యదర్శి భీమరశెట్టి నూకేష్, జర్నలిస్టులు శిలపరశెట్టి ప్రసాద్, కే భానోజీరావు, యల్లపు రమణాజీ, చిన్ని శ్రీను, మూర్తి, కిరణ్, శివాజీ, ఎం శ్రీనివాసరావు, మున్నా, నంబారు సత్యారావు, రవి, కర్రి గంగాధర్, రామచంద్రరావు, మణికుమార్, జనార్దన్, రవ్వ శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు



ఉగ్రదాడిలో అసువులు బాసిన పర్యాటకులకు నివాళులు



హాజరైన సభ్యులు

కశింకోట: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన పర్యాటకులకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఘనంగా నివాళులర్పించింది. ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఎంపీపీ కలగా లక్ష్మీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఈ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు మండలంలోని పలు సమస్యలపై సమావేశం చర్చించింది. ఉపాధి హామీ పథకంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని కశింకోట- 2, జెట్టపురెడ్డితుని ఎంపీటీసీ సభ్యులు నడిపల్లి గంగాభవాని, షేక్ దర్గా ఆరోపించారు. వీటిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వి.వి. రవి కుమార్ హామీ ఇచ్చారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు అడిగిన ప్రశ్నకు మేట్లు కూడా కూలీలతోపాటు పని చేయాలని ఏపీవో ఎం. శ్రీనివాసరావు బదులిచ్చారు. కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయనుందన్నారు. వీటిలో 18 నుంచి 59 ఏళ్లలోపు కార్మికులు కార్మిక శాఖలో నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలను దీనిలో చేర్చుతున్నట్లు తెలిపారు. ఉప తహసీల్దార్ కుమారస్వామి మాట్లాడుతూ సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేస్తున్నామని, మ్యూటేషన్‌లో కాస్త ఆలస్యం అవుతుందన్నారు. రీ-సర్వేలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, ఒకరి పేరున ఉన్న భూమిని మరొకరి భూమిగా నమోదు చేస్తుండటంతో అధికారుల చుట్టూ తిరగలేక, రికార్డులు సరి చేసుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి విమర్శించారు. సరైన డాక్యుమెంట్లు ఉంటే తమ స్థాయిలోనే వీటిని సరి చేస్తామని, వివాదాలు ఉంటే అప్పీలుకు వెళ్లాల్సి ఉంటుందని ఉప తహసీల్దార్ బదులిచ్చారు. ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి మాట్లాడుతూ అర్హులైన అంగన్‌వాడీ కార్యాలయంలో చదివిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, ఇందుకు ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆడ పిల్లలకు ప్రవేశపెట్టిన బాలిక సంరక్షణ పథకం బాండ్లు ఇచ్చి 18 సంవత్సరాలు పూర్తయి గడువు ముగిసినా నగదు చెల్లించలేదని, చర్యలు తీసుకోవాలని కశింకోట ఎంపీటీసీ సభ్యురాలు యల్లపు వర లక్ష్మి ఐసీడీఎస్ అధికారులను కోరారు. మండలంలో 17 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ సారా అరికట్టడానికి స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. తాళ్లపాలెం సంతలో మూసి వేసిన పాఠశాలను తిరిగి తెరిపించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో కేఎస్ఎన్ మూర్తి బదులిచ్చారు. పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాలరావు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, ఏవో ఏఏ ఖాన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులతోపాటు శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అత్యంత తక్కువ జీతంతో సర్కారు పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పని భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రభుత్వంపై ఉద్యమాలు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, యూనియన్ నాయకులు జిల్లా నాయకులు శ్రీదేవి, బీబీ, శివలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

'అవఖండం లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి'

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి అవఖండం సౌత్-2 భూముల్లో లేఅవుట్లు వేయడం వల్ల వర్షాలు పడే సమయంలో అనకాపల్లి పట్టణానికి ప్రమాదం పొంచి ఉందని అనకాపల్లి అవఖండం పరిరక్షణ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు శనివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు పోస్టుకార్డు రాశారు. ఆ వరద నీరు మొదటగా అనకాపల్లి అవఖండంలోకి చేరి తర్వాత కొండకర్ల ఆవలోకి చేరి అక్కడ నుంచి సముద్రంలో కలుస్తుందన్నారు. దీనికి అడ్డంగా ఎటువంటి నిర్మాణాలు చేసినా అనకాపల్లి పట్టణానికి పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అవఖండం భూముల్లో వేసిన లే అవుట్లపై ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లిక్విడ్ గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



లిక్విడ్ గంజాయి

పెందుర్తి: మూడు లక్షల విలువచేసే రెండు కిలోల లిక్విడ్ గంజాయి (హేష్ ఆయిల్)ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను పెందుర్తి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మధ్యాహ్నం 12.30గంటల సమయంలో పెందుర్తి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని దొగ్గవానిపాలెం వద్ద సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. గుంటూరు జిల్లాకు చెందిన మంద మార్తమ్మ, కంప జీసస్‌కుమార్ రెండు కిలోల లిక్విడ్ గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

మజ్జిగ పంపిణీ



ప్రజలకు మజ్జిగ పంపిణీ దృశ్యం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నరసింగరావు పేటలో కమ్మాస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మాట్లాడుతూ వేసవి పూర్తయ్యేవరకు ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కాకర్ల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొల్లి శ్రీనివాసరావు, కోశాధికారి ధనాల వెంగళరావు, సభ్యులు పార్వతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో నూతన విధానాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ రామారావు

కశింకోట: వ్యవసాయంలో అనుసరిస్తున్న, అనుసరించాల్సిన నూతన విధానాలపై అవగాహన కల్పించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడు ఎం. రామారావు కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి వ్యవసాయాభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, సుబ్రహ్మణ్యం, వ్యవసాయ అధికారి ఎం. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం పరిష్కారానికి చర్యలు



అర్జీపై చర్చిస్తున్న మండల ప్రత్యేక అధికారి సుభాషిణి

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ భూమి వివాదం పరిష్కరించాలని ఒక అర్జీ వచ్చింది. దీన్ని పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి సుభాషిణి ఆదేశించారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఉప తహసీల్దార్ కుమారస్వామి పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

పరవాడ: తాడి రైల్వే స్టేషన్ సమీపంలోని తుప్పల్లో గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. రైల్వే ట్రాక్‌కు 50 మీటర్ల దూరంలో మృతదేహాన్ని పరిశీలించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వయస్సు 40-50 మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 9440796038కు సమాచారం అందించాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో స్వామికి కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి ఉదయం 9:30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో కల్యాణ వేడుక కొనసాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అంతకుముందు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడ సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో జరిగిన ఈ సేవలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపచేశారు. అష్టోత్తర శత నామావళి పూజ అనంతరం భక్తులు గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. విశేష హారతులు సమర్పించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు పంపిణీ చేశారు.

ఎండ తీవ్రతతో విలవిల



కశింకోట వద్ద వెలవెలబోయిన జాతీయ రహదారి

కశింకోట: వేసవి ఎండ తీవ్రతతో శనివారం కశింకోట వద్ద జాతీయ రహదారి వెలవెలబోయింది. మధ్యాహ్న సమయంలో వాహనాల రద్దీ తగ్గింది. అరకొరగా నడిచాయి. జన సంచారం తగ్గింది. దీంతో రహదారిపై వాహన సంచారం తగ్గి బోసిపోయింది. స్థానిక ప్రధాన రహదారి, వీధుల్లో కూడా జన సంచారం లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో యధావిధిగా వాహనాల రద్దీ పెరిగింది. ప్రజల తమ కార్యకలాపాల్లో నిమగ్నం కావడంతో రోడ్లు కళకళలాడాయి.